

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు (గ్రేరంగం రకం) టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



తుంగభద్ర పరవళ్లు

తుంగభద్ర జలాశయంలో శుక్రవారం నీటి నిల్వ 1,633 అడుగులకు గాను 1624.73 అడుగులకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 58,027, అవుట్‌ఫ్లో 65,616 క్యూసెక్కులుగా ఉంది.

గరిష్టం/కనిష్టం
34.6°/23.6°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్ అదాలత్

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని కోర్టుల్లోనూ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు ఇ.భీమారావు, కార్యదర్శి ఎన్.రాజశేఖర్ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు అన్ని కోర్టుల్లోనూ జాతీయ లోక్ అదాలత్ ప్రారంభమవుతుందన్నారు. మోటార్ వాహనాల ప్రమాద భరిత కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీచేయదగ్గ క్రిమినల్ కేసులు, వినియోగదారుల ఫోరం కేసులు, పంచాయతీ, మున్సిపల్ ట్యాక్సు కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను రాజీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

బొమ్మనహాళ్: 'తుంగభద్ర జలాశయానికి వరద నీరు భారీగా వస్తోంది. ఎగువ కాలువకు (హెచ్చెల్సీ) నీరు ఈ నెల 10న విడుదల చేయనున్నారు. హెచ్చెల్సీ అత్యవసర మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేయాలి' అని అనంతపురం హెచ్చెల్సీ ఎస్ఈ విశ్వనాథ్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం బొమ్మనహాళ్, దర్గాహొన్నూరు హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలోని ఉద్దేహాళ్, మల్లికేతి, నాగలాపురం, దర్గాహొన్నూరు గ్రామాల వద్ద జరుగుతున్న వంతెన, లైనింగ్ పనులను ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి, ఈఈ పార్థసారథి పరిశీలించి, కాంట్రాక్టర్లకు సూచనలు ఇచ్చారు.

రగులుతున్న కుంపట్లు

- అంతర్గత విభేదాలతో నలిగిపోతున్న టీడీపీ కార్యకర్తలు
- మాకు ఈ ఎమ్మెల్యే వద్దంటూ బండారు శ్రావణిశ్రీపై ఫిర్యాదుల పర్వం
- తొలి నుంచీ అనంతపురం అర్బన్‌లో దగ్గుపాటి, వైకుంఠం మధ్య ఆగని పోరు
- పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపులో నువ్వంటే నువ్వేనని రచ్చకెక్కిన పరిస్థితి
- కళ్యాణదుర్గంలో అమిలినేని.. ఉన్నం మారుతీ చౌదరి మధ్య తారస్థాయికి వర్గపోరు
- నాయకుల మధ్య వైరంతో కార్యకర్తల్లో రోజురోజుకూ పెరుగుతున్న అసహనం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారులో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, నేతల మధ్య కలహాల కుంపట్లు రాజుకున్నాయి. ఓవైపు హామీలు అమలు చేయలేదని సామాన్యులు గగ్గోలు పెడుతుంటే.. మరోవైపు ఎమ్మెల్యేలపై సొంతపార్టీలోనే అసమ్మతుల బెడద ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సామాన్యులకు హామీలు అమలు చేయాల్సిన ఎమ్మెల్యేలు నిత్యం రాజకీయ గొడవలతో ఎత్తులకు పైఎత్తులు వేసుకోవడంలోనే సమయం సరిపోతోంది. సొంత పార్టీలోనే కార్యకర్తలు ఎమ్మెల్యేలపై తీవ్ర అసహనంతో ఉన్నట్టు తెలుస్తోంది. స్వయానా ఎమ్మెల్యేలే 'ఇంటింటికీ సుపరిపాలన' పేరుతో తమ ఊరికి వచ్చినా కార్యకర్తలు అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

దగ్గుపాటికి ఆది నుంచీ అసమ్మతి పోరు..

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచిన రోజునుంచీ దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరికి మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. దగ్గుపాటి వ్యవహారాలపై ఎప్పటికప్పుడు అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నారు. ప్రభాకర్‌పై కూడా దగ్గుపాటి ఫిర్యాదులు చేస్తున్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి దగ్గుపాటిపై ఆరోపణలు వచ్చాయి. ఆ మరుసటి రోజే పాతూరులో ప్రభాకర్ చౌదరి అక్రమ రవాణా చేస్తున్నారంటూ ఎమ్మెల్యే వర్గీయులు వీడియోలను వైరల్ చేశారు. తాజాగా దగ్గుపాటికి సుధాకర్‌నాయుడు లాంటి నేతలు కూడా సొంత పార్టీలో అసమ్మతి వాదులుగా ముద్ర వేసుకున్నారు.

శ్రావణిశ్రీపై ఫిర్యాదుల వెల్లువ..

శింగనమల ఎమ్మెల్యే శ్రావణిశ్రీపై రోజురోజుకూ అసమ్మతి వెల్లువెత్తుతోంది. నియోజకవర్గంలో ఇసుక దోపిడీ విచ్చలవిడి అయ్యింది. ఎమ్మెల్యే తల్లి వసూళ్లకు పాల్పడుతోందంటూ ఏకంగా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు ఇక్కడ కేశవరెడ్డి, నరసానాయుడుతో కూడిన టీడీపీ ద్విసభ్య కమిటీ ఉంది. ఈ కమిటీ సభ్యుల అనుచరులకు కనీస విలువ ఇవ్వడం లేదని శ్రావణిశ్రీపై ఫిర్యాదు చేస్తున్నారు. నియోజకవర్గంలో వసూళ్లు తప్ప సొంత పార్టీ కార్యకర్తలకు ఏమాత్రమూ విలువ ఇవ్వడం లేదంటూ పలువురు కార్యకర్తలు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.

అమిలినేనికి ఈ–స్టాంప్ బ్రేకులు..

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు ఇటీవల ఈ–స్టాంప్‌ల కుంభకోణం మకిలి అంటుకుంది. ఇందులో తన ప్రమేయం లేదంటూ టీడీపీలోనే తన ప్రత్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి కుమారుడు ఉన్నం మారుతీ చౌదరి పేరును తెరమీదకు తెచ్చారు. తన కంటూ సొంత పార్టీలో ప్రత్యర్థులు లేకుండా చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఈయన పేరు బయటకు తెచ్చారని ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు ఉన్నం వర్గీయులకు సంబంధించి ఏ ఒక్కపనికీ ఎమ్మెల్యే సహకరించడం లేదని ఉన్నం ఆరోపిస్తున్నారు. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ పార్టీకి పనిచేసిన వారికి సొంతపార్టీ నాయకులే విలువనివ్వడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా ఏడాది పాలన సందర్భంగా ఇంటింటికీ వెళుతున్న సమయంలోనూ ఎమ్మెల్యేలకు సొంతపార్టీ కార్యకర్తలు సహకరించడం లేదు.

'అల్లూరి'.. ఒక సమూహ శక్తి



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, తదితరులు

అనంతపురం అర్బన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఒక వక్తి కాదని, ఆయన ఒక సమూహ శక్తి అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, కార్మిక సంక్షేమ బోర్డు రాష్ట్ర చైర్మన్ వెంకటశివుడు యాదవ్ పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. అల్లూరి దేశభక్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఫైళ్లు పక్కాగా ఉండాలి

చుక్కల భూములు, 22ఏ జాబితాకు సంబంధించి ఫైళ్లు సమగ్ర వివరాలతో పక్కాగా ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. చుక్కల భూముల క్లెయిమ్‌ల పరిష్కారంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా డాటెడ్ ల్యాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు.

గూగూడుకు పోటెత్తిన భక్తులు



చిన్నసరిగెత్తుకు ముస్తాబైన కుళ్లాయిస్వామి పీర్లు



భక్తుల పొర్లుదండాలు

నార్పల మండలం గూగూడులో కుళ్లాయిస్వామి ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారుజామున చిన్నసరిగెత్తు సందర్భంగా అర్చకులు హుసేనప్ప కుళ్లాయిస్వామి పీరును ప్రత్యేక పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. కుళ్లాయిస్వామి– ఆంజనేయ స్వామి దర్శనం కోసం రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కాసేపు తొక్కిసలాట జరిగింది. చిన్న సరిగెత్తులో భాగంగా స్వామి వారి భక్తులు ఫకీర్లుగా మారి జలధి పోయే వరకు నియమనిష్టగా ఉంటారు.

– నార్పల/ సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అగ్నిగుండం వద్ద భక్త జనసందోహం



కిటకిటలాడుతున్న దుకాణాలు



చక్కెర చదివింపుల కోసం ..

గంజాయి కేసులో 17 మందికి జైలు

అనంతపురం: గంజాయి కేసులో 17 మందికి జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఇందులో 12 మందికి రెండేళ్ల జైలు, మరో ఐదుగురికి ఏడాది జైలు శిక్ష పడింది. మొత్తం 20 మందిపై అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2018లో గంజాయి కేసు నమోదైంది. నిందితులందరినీ ఆ ఏడాది సెప్టెంబర్ 11న అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 3 కిలోల గంజాయి, రూ.40,12,000 నగదు, 32 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు క్యాలిక్యులేటర్లు, హాట్‌స్పాట్ రూటర్, కారు స్వాధీనం చేసుకున్నారు. తర్వాతి కాలంలో నిందితుల్లో ముగ్గురు కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన షేక్ సిరాజుద్దీన్ (59), వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పట్టణానికి చెందిన కార్మూరి ఇంద్రశేఖర్ (68), గుత్తికి చెందిన ఆర్.బి.విజయ్‌కుమార్ (48) మృతి చెందారు. మిగిలిన వారిపై నేరం రుజువైంది. వీరిలో తాడిపత్రికి చెందిన అచ్చుకట్ల అబ్దుల్లా, అచ్చుకట్ల మహమ్మద్ ఖాసీం, కోవెలకుంట్ల జాఫర్ వలి, గుత్తికి చెందిన ఎం.నారాయణ, వై.గోపాల్, ముల్లా జాఫర్, వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన కోవెలకుంట్ల ఖలీల్, చౌడం సుబ్బరాయుడు, ఎర్రముక్కపల్లికి చెందిన గోనుగుంట్ల రామయ్య, పెద్దమండ్యం మండలం గుల్లకుంటకు చెందిన పి.రామచంద్రారెడ్డి, పి.జయచంద్రారెడ్డి, కర్నూలు జిల్లా డోన్ పట్టణానికి చెందిన దూదేకుల ఇబ్రహీంకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.20వేల చొప్పున జరిమానా విధించారు. మరో ఐదుగురు తాడిపత్రికి చెందిన అచ్చుకట్ల సాదిక్ అలియాస్ కట్లపుడి సాదిక్, గుత్తి హబీబా ఖాన్, అచ్చుకట్ల అబు బకర్ అలియాస్ బకర్, చౌడం ప్రసాద్ కుమార్ అలియాస్ ప్రసాద్, కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన దూదేకుల లాల్ బాషాకు ఏడాది జైలు, ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ జడ్జి సత్యవాణి తీర్పు చెప్పారు.

దళితులంటే అంత చులకనా?



అనంతపురం టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న యువజన విభాగం, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు

- సింగయ్యను కుక్కపిల్లతో చంద్రబాబు పోల్చడంపై ఆగ్రహం
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం, ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఆందోళన
- సీఎంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్
- ఫిర్యాదు స్వీకరణకు నిరాకరించడంతో పోలీస్ స్టేషన్ వద్ద నిరసన

అనంతపురం: దళితులంటే సీఎం చంద్రబాబు నాయుడుకు చులకన భావం ఎందుకని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త సింగయ్య మృతి చెందితే 'కుక్కపిల్లను పడేసినట్లు పడేశారం'టూ సీఎం చేసిన వ్యాఖ్యలు దళితుల మనోభావాలను దెబ్బతీశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ 'దళితుల ఇళ్లలో ఎవరైనా పుట్టాలనుకుంటారా' అని హేళనగా మాట్లాడారని, తరచూ దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న చంద్రబాబుతో పాటు పత్రికలో ప్రచురించిన 'ఈనాడు' యాజమాన్యంపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు మధ్యాహ్నం 12 గంటలకు వెళ్లారు. అయితే ఆ సమయంలో సీఐ, ఎస్ఐ లేరు. మూడు గంటలపాటు ఫిర్యాదు తీసుకోకుండా అవమానానికి గురి చేశారంటూ ఆందోళనకారులు ఆవేదన చెందారు. పోలీసులు రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటారా.. లేకపోతే రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటారా అని ప్రశ్నించారు. పోలీసుల వైఖరిని తప్పు పడుతూ నినాదాలు చేశారు. సాకే చంద్రశేఖర్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ మాట్లాడుతూ సింగయ్య భార్య మేరీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు వచ్చి ఆ రోజు జరిగిన ఘటనపై స్పష్టత ఇచ్చారన్నారు. సింగయ్య ప్రమాదానికి గురైన వెంటనే వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులే అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లాలని ప్రయత్నం చేస్తే పోలీసు అధికారులు అడ్డుచెప్పారన్నారు. అంబులెన్స్ వచ్చేంతవరకు తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం ప్రదర్శించిన పోలీసులపైన, అధికారులపైన చర్యలు తీసుకోవాలన్నారు. సింగయ్యతో కలిసి అంబులెన్స్‌లో ప్రయాణించిన వారిని సిట్టింగ్ జడ్జితో విచారించాలని డిమాండ్ చేశారు. సీఎం బాటలోనే టీడీపీ నాయకుడు చింతమనేని ప్రభాకర్, తదితరులు దళితులు శుభ్రంగా ఉండరని, వారికి పదవులు అక్కర్లేదని హేళన చేస్తున్నారని మండిపడ్డారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఫిర్యాదు ఇస్తే అందుకు సంబంధించి రశీదు కూడా ఇవ్వడం లేదని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటుండటంతో పోలీసులు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసబాబు నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మిద్దె నగేష్, కుళ్లాయిస్వామి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు, సర్పంచులు సాకే రామాంజినేయులు, ఓబులేసు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు పసలూరి ఓబులేసు, యువజన విభాగం నగర ఉపాధ్యక్షుడు వినీత్, ఉదయ్, నగర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జెడ్పీటీసీ భాస్కర్, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యదర్శి సాకే ఆనంద్, ఎస్సీ సెల్ నాయకులు వడియం పేట అంజి, వెంకటేశ్, ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం

అనంతపురం కార్పొరేషన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల పిల్లలు వైద్య విద్యనభ్యసించాలని 17 వైద్య కళాశాలను తీసుకువస్తే.. కూటమి ప్రభుత్వం అక్కసుతో ఆ కళాశాలను నిర్వీర్యం చేయాలని చూస్తోందని, తక్షణమే వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచన మానుకోవాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్ డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువ వైద్యులపై పోలీసుల దాడిని ఖండించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అనంతపురం నియోజకవర్గ అధ్యక్షుడు కైలాష్, నాయకులు నారప్ప, మంజునాథ్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, అశోక్, పులి కార్తికేయ, రాహుల్‌రెడ్డి, వంశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

10న రైల్వే ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఎన్నికలు

గుంతకల్లు: స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక వర్గం ఎన్నికలు ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు సీనియర్ డీపీఓ హెచ్‌ఎల్ నరసింహ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక వర్గం కాల పరిమితి పూర్తి కావడంతో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్ పరిధిలో దాదాపు 941 మంది ఓటర్లు ఉండగా సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, కోశాధికారితోపాటు ఆరుగురు కమిటీ మెంబర్లను ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. కాగా, శుక్రవారం ముఖ్యమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ నెల 10న ఉదయం 8.00 నుంచి సాయంత్రం 4.00 గంటలకు వరకూ బ్యాలెట్ పత్రం ద్వారా ఓటింగ్ చేపట్టనున్నారు. మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది.

ఏమైందిరా నాన్నా..



ఈ సృష్టిలో ఏ జీవికైనా తల్లిప్రేమ ఒక్కటే. తన బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకుంటుంది తల్లి. ఓ వానరం కూడా తన బిడ్డను పొత్తిళ్లలో జాగ్రత్తగా ఎత్తుకుని పరిసరాలంతా తిరిగింది. ఆహారం కోసం అన్వేషించింది. తినడానికి ఏదో దొరికిన తర్వాత బిడ్డను కిందకు దించింది. కానీ నిర్జీవంగా కన్పించిన బిడ్డ వైపు తదేకంగా చూస్తూ విషాదంలో మునిగిపోయింది. ఈ దృశ్యం శుక్రవారం అనంతపురం నగర శివారులోని వడియంపేట వద్ద 'సాక్షి' కంటపడింది.

– సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం







పన్ను ఎగవేతను కట్టడి చేయాలి

- ఆర్థిక శాఖ మంత్రి కేశవ్

అనంతపురం అర్బన్: పన్ను ఎగవేతదారులను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని మంత్రుల కమిటీకి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. దేశవ్యాప్తంగా జీఎస్టీ పన్నుల వసూళ్ల సరళిని పరిశీలించేందుకు ఏర్పాటైన మంత్రుల కమిటీ శుక్రవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. కమిటీ కన్వీనర్, గోవా సీఎం డాక్టర్ ప్రమోద్ పి.సావంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యునిగా ఉన్న మంత్రి కేశవ్ కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ డేటా యాక్సెస్ అన్ని రాష్ట్రాల ఇంట్రాస్టేట్ అండ్ ఇంటర్ స్టేట్ స్థాయిలో సమాచారం లైవ్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. తద్వారా పన్ను ఎగవేతదారులను కట్టడి చేయడానికి వీలువుతుందన్నారు.



వర్చువల్ సమావేశం నిర్వహిస్తున్న మంత్రుల కమిటీ కన్వీనర్ డాక్టర్ ప్రమోద్ పి.సావంత్ (ఇన్‌సెట్) పాల్గొన్న మంత్రి పయ్యావుల కేశవ్

• భిక్షమెత్తితేనే భుక్తి

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సొంత ఇలాకాలోని ఓ దివ్యాంగుడు పింఛన్ అందక భిక్షమెత్తుకుని పొట్ట పోసుకుంటున్నాడు. హిందూపురానికి చెందిన రేణుక రాజు దివ్యాంగుడు. గత ప్రభుత్వంలో పింఛన్ వచ్చేది. కొత్త ప్రభుత్వంలో పింఛన్ మరింత పెరుగుతుందనుకున్నాడు. అయితే ఇందుకు విరుద్ధంగా పింఛన్ జాబితా నుంచి ఆయన పేరు కనుమరుగైంది. అధికారులను బతిమాలుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో కొన్ని నెలలుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంచరిస్తూ భిక్షమెత్తుకుంటున్నాడు. శుక్రవారం గూగూడు కుళ్లాయి స్వామి ఉత్సవాల్లో ఈ దృశ్యం చూపరులను కలిచివేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



గూగూడు కుళాయిస్వామి ఉత్సవాల్లో భిక్షాటన చేస్తున్న రేణుక రాజు

18 వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్యం పరికరాలు

- డీసీఓల సమావేశంలో పీడీ రఘునాథరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది 18 వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్యం (డ్రిప్, స్ప్రింక్లర్లు) పరికరాలను రైతులకు సకాలంలో మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి తెలిపారు. అయితే పరికరాల నాణ్యత విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో కంపెనీ డీసీఓలు, మైక్రో ఇంజనీర్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. గతేడాదిలో ఏవైనా పెండింగ్‌లో ఉంటే వారం రోజుల్లో పూర్తి చేసి పంపాలన్నారు. ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటికే 1,359 హెక్టార్లకు కేటాయించిన యూనిట్లను సరఫరా చేసి సంబంధిత పొలాల్లో బిగించే (ఇన్‌స్టాలేషన్) పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఉద్యానశాఖ డీడీ డి.ఉమాదేవి, ఏపీడీ ధనుంజయ, ఏడీహెచ్‌లు దేవానంద్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీ ప్యాట్‌లో ఓటీపీఆర్‌ఐ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి

అనంతపురం: జీప్యాట్ (గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్)లో జేఎన్‌టీయూ(ఏ) ఓటీపీఆర్‌ఐ విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ స్థాయిలో గణనీయమైన ర్యాంకులు సాధించిన విద్యార్థులు డి.హేమంత్‌కుమార్ (204 ర్యాంకు), కె.గురుచరణ్ (2,484), జి.దేవీ ప్రియ (3,828), ఎస్.కుష్వంత్ (4,058)ను ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్ అభినందించారు.

ఫైనాన్స్ కంపెనీలకు కుచ్చు టోపీ

- ఆరుగురు కేటుగాళ్ల అరెస్ట్
- 92 ద్విచక్రవాహనాలు, ఆటో స్వాధీనం

తాడిపత్రి టౌన్: నకిలీ ధ్రువీకరణ పత్రాలను ఫైనాన్స్ కంపెనీల్లో దాఖలు చేసి కొనుగోలు చేసిన వాహనాలను సగం ధరకే ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్న ఆరుగురు కేటుగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. తాడిపత్రి పట్టణ పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఏఎస్పీ రోహిత్‌కుమార్ వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన కొందరు ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులు జిల్లా ఎస్పీకి చేసిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు తాడిపత్రి ప్రాంతంలోనే వందల సంఖ్యలో వాహనాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో రంగంలో దిగిన పోలీసులు పక్కా ఆధారాలతో తాడిపత్రికి చెందిన గయాజుద్దీన్, కలీముల్లా, ఇంతియాజ్, రోషన్, ముస్తాఫా ఖాద్రీ, అనంతపురానికి చెందిన నూర్‌మహమ్మద్‌ని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో వాస్తవాలు బహిర్గమతయ్యాయి. ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ట్రాక్టర్లు, లారీలను సైతం వీరు సగం ధరకే విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు గుర్తించారు. దీంతో ఇప్పటి వరకూ 92 ద్విచక్ర వాహనాలు, ఓ ఫోర్‌వీలర్ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై శుక్రవారం కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, ఈ ముఠాలోని మరికొందరు సభ్యులు అజ్ఞాతంలో ఉన్నారని త్వరలో వారిని కూడా అరెస్ట్ చేస్తామని ఏఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రతి రెండు రోజులకు ఒకసారి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఎవరైనా సగం ధరకే వాహనాలు కొనుగోలు చేసి ఉంటే స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగిస్తే వారిని బాధితులుగా గుర్తిస్తామని పేర్కొన్నారు. ఈ అంశంలో నిర్లక్ష్యం వహిస్తే వారిని కూడా బాధ్యులుగా గుర్తిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ సాయిప్రసాద్, ఎస్‌ఐ గౌస్ పాల్గొన్నారు.



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కేవీకేలో సర్టిఫైడ్ విత్తనాలు

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో సర్టిఫైడ్ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. కందులు (పీఆర్‌జీ-176, ఉజ్వల), (ఎల్‌ఆర్‌జీ-52 అమరావతి) కిలో రూ.150, 4 కిలోల బ్యాగ్ రూ.600, పెసర (ఎల్‌జీజీ-607, ఎల్‌జీజీ 574), మినుములు (ఎల్‌బీజీ 884) కిలో రూ.150తో విక్రయిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 97046 66923, 70135 71755లో సంప్రదించాలని కోరారు.

ఆయుర్వేద ఉత్పత్తుల సేవా కేంద్రంలో విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం: స్థానిక ఎ.నారాయణపురం పంచాయతీ రాఘవేంద్ర కాలనీ సమీపంలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న ప్రజలను తప్పుదోవ పట్టించే ఆయుర్వేద ఉత్పత్తుల సేవా కేంద్రంలో విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులు కస్టమర్ల నుంచి ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లు తీసుకుంటూ కనిపించారు. కొనుగోలుదారుల పేర్లు, ఫోన్ నంబర్లు, సేకరించిన మొత్తం ఇతర వివరాలు, వాట్సాప్ చాటింగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. 1954 డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదించారు. ఎస్-3 గ్రూప్స్ పవర్ సిరప్, సీహెచ్‌ఆర్ డీఐఏ కంట్రోల్ సిరప్, ఎస్3 గ్రూప్స్ ఆయుర్వేద ఉత్పత్తులపై సోషల్ మీడియా, ఇంటర్నెట్ ద్వారా విరివిగా ప్రచారం చేస్తున్నారు. షుగర్ వ్యాధిని నియంత్రిస్తామని, ప్రజల్లో లైంగిక శక్తిని పెంచుతామని నమ్మబలికి కాల్ చేసే వినియోగదారుల నుంచి ఆర్డర్లు తీసుకుంటున్నారు. ఈ వివరాలను నెల్లూరుకు చెందిన భరత్ అలియాస్ ఆలకుంట భరత్ కుమార్‌కు పంపిస్తున్నట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు, ఆయుర్వేద డాక్టర్లు డాక్టర్ కె.మాధవి, డాక్టర్ కేఎస్ రాంకుమార్, డాక్టర్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని వదలి వెళ్లకండి సార్..



ఉపాధ్యాయుణ్ని హత్తుకుని కన్నీరు పెట్టుకుంటున్న విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుడు హనుమంతురాయుడు ఇటీవల మరొక పాఠశాలకు బదిలీ అయ్యారు. శుక్రవారం పాఠశాలలో వీడ్కోలు సభ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు 'మమ్మల్ని వదిలి వెళ్లకండి సార్' అంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఈ దృశ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ కన్నీరు కార్చారు. హనుమంతురాయుడు విద్యార్థుల మనస్తత్వాన్ని అర్థం చేసుకొని.. వారికి అనుగుణంగా బోధన చేసేవారని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు. పేద విద్యార్థులకు గురుకులం, ఏపీఆర్‌ఎస్ వంటి వాటికి శిక్షణ ఇచ్చి.. ఎంపిక కావడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.

స్కూళ్లకు మరో 'ఓహెచ్' పాయె

- నేడు ఏ ఒక్క పాఠశాల మూతపడకూడదన్న ప్రభుత్వం

అనంతపురం ఎడ్యుకేషన్: రథసప్తమి సందర్భంగా గత నెల 27న తీసుకోవాల్సిన ఆప్షన్ హాలిడే (ఓహెచ్)ను రద్దు చేసిన ప్రభుత్వం తాజాగా మొహర్రం సందర్భంగా శనివారం (నేడు) తీసుకోవాల్సిన ఓహెచ్‌పై అనేక ఆంక్షలు విధించింది. ఆప్షన్ హాలిడే రోజున ఏ ఒక్క స్కూల్ మూతపడకూడదని పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు స్పష్టం చేశారు. ఆప్షనల్ హాలిడే అనేది పాఠశాలలకు కాదని, టీచర్లకు మాత్రమేనని పేర్కొన్నారు. అవసరమనుకుంటే పాఠశాలలో 50 శాతం మంది సెలవును వినియోగించుకుని తక్కిన 50 శాతం మంది పని చేయాలని స్పష్టం చేశారు. దీంతో శనివారం నాటి ఓహెచ్‌పై జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఓహెచ్ వాడుకునే టీచర్లు తమ వ్యక్తిగత స్కూల్ అటెండెన్స్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించండి

- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

రాయదుర్గం టౌన్: వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారో మంత్రి లోకేష్ సమాధానం చెప్పాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, కోశాధికారి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం సుపరిపాలన సంబరాలు చేసుకోవడం కాదు.. విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులు విడుదల చేయాలనే డిమాండ్‌తో వందలాది మంది విద్యార్థులతో కలిసి శుక్రవారం రాయదుర్గంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు రూ.6,400 కోట్లను తక్షణమే విడుదల చేయాలన్నారు. బకాయిలు విడుదలకాకపోవడంతో కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఫీజు బకాయిలు విడుదల చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 11న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్‌నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు శశి, ఉపాధ్యక్షుడు తరుణ్, మున్నా, నవీన్, సచిన్, నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కార్మికుల జీవితాలతో చెలగాటమొద్దు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు

అనంతపురం అర్బన్: కార్మికుల జీవితాలతో చెలగాటమాడరాదని కూటమి ప్రభుత్వాన్ని శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు హెచ్చరించారు. ఏడు నెలలుగా బకాయిపడిన వేతనాన్ని తక్షణమే చెల్లించాలంటూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, ఐఎఫ్‌టీయూ ఏసురత్నం, రైతు కూలీ సంఘం రాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం రామకృష్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు జి.ఓబుళు మాట్లాడుతూ.. నెలలుగా వేతనం చెల్లించకపోతే కార్మికులు ఎలా బతుకుతారంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. వేతనాలు చెల్లించాలంటూ 85 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ఇటు ప్రభుత్వం కానీ, అటు అధికారులు కానీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. యోగా డే అంటూ వందల కోట్ల రూపాయలను ఖర్చు చేసిన కూటమి ప్రభుత్వానికి కార్మిక కుటుంబాల ఆకలి కేకలు వినిపించడం లేదని మండిపడ్డారు. తక్షణమే ఏడు నెలల వేతన, 40 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లింపుల విషయంలో వాస్తవాన్ని కప్పిపుచ్చుతూ కార్మికులకు బకాయిలు చెల్లించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తప్పుడు సంకేతాలను ప్రజల్లోకి చొప్పించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికుల బకాయిలు పూర్తిగా చెల్లించే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, రాము పాల్గొన్నారు.

వజ్రకరూరు సర్పంచ్‌కు జాతీయ స్థాయి అవార్డు

వజ్రకరూరు: ఢిల్లీలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ డెమోక్రసీ ఆధ్వర్యంలో డాన్‌బాస్కో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఏర్పాటు చేసిన షీరైజెంట్స్-2025 శిక్షణా తరగతులకు హాజరైన వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసాకు జాతీయ స్థాయి అవార్డు దక్కింది. మొత్తం 45 మంది మహిళా ప్రజాప్రతినిధులు ఈ శిక్షణా తరగతులకు హాజరు కాగా, జూన్ 28 నుంచి ఈ నెల 4వ తేదీ వరకూ అవగాహన కల్పించారు. ప్రధానంగా పాలన, కమ్యూనికేషన్, ప్రజా నైతికత, నాయకత్వ నైపుణ్యాలు, సమస్యలు-వాటి పరిష్కారాలు, పార్లమెంట్ సందర్శన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బాల్య వివాహాలను అరికట్టడం, మహిళా సంఘాల బలోపేతం అంశాలపై మోనాలిసా మాట్లాడారు. దీంతో ఆమెను అవార్డుకు నిర్వాహకులు ఎంపిక చేసి, బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డును అందజేశారు.



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ మోనాలిసా

పెంపకానికి 29.90 లక్షల మొక్కలు సిద్ధం

అనంతపురం సెంట్రల్: జిల్లాలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద 29.90 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేష్ అప్పావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 20 నర్సరీల్లో మొక్కలు సంరక్షిస్తున్నట్లు వివరించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, రెవెన్యూ ప్రాంతాలు, గృహతోటలు, పొలాల్లో మొక్కలు నాటేందుకు ఆసక్తి ఉన్న వారు ఆయా నర్సరీలు, అటవీశాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

జేడీఏ కార్యాలయ ఏఓగా మునీర్



మునీర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న అసోసియేషన్ నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ పరిపాలనాధికారి (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా మునీర్ అహ్మద్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సుజాత గతనెలాఖరున ఉద్యోగ విరమణ చేశారు. కర్నూలు జిల్లాలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మునీర్ అహ్మద్ ఏఓగా పదోన్నతి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రవికుమార్, అదాంఖాన్, జిల్లా నాయకులు రాజేంద్రప్రసాద్, బాలాజీనాయక్‌తో పాటు ఆ శాఖ ఉద్యోగులు నూతన అడ్మిన్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: సనప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు శుక్రవారం పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. వక్తలు బదిలీ అయిన ఉపాధ్యాయులు నాగరాజు, రమణారెడ్డి, అనురాధ, ప్రభాకర్, చంద్రకళ, కవిత, కుసుమమ్మ, మదన్, మురళి, మల్లికార్జునరెడ్డి, నల్లప్ప సేవలను కొనియాడారు. అనంతరం వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న ఏఎంవీఐ కేవీఎల్ఎన్ ప్రసాద్

అనంతపురం సెంట్రల్: విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చే స్కూల్, కాలేజీ బస్సులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఏఎంవీఐ కేవీఎల్ఎన్ ప్రసాద్ డ్రైవర్లను హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. ప్రతి బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్, ఎమర్జెన్సీ డోర్ ఉండాలని ఆదేశించారు. కాలం చెల్లిన బస్సులను వినియోగిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం బుక్కరాయసముద్రంలో ఉపాధి కూలీలకు రోడ్డు ప్రమాదాలు– తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

పొగాకు వాడకం అనర్థదాయకం



పొగాకు నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి అనర్థదాయకమని వక్తలు పేర్కొన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు పొగాకు నియంత్రణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ శ్రీరాములు పొగాకు వినియోగంతో కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ప్రజలు అందరూ మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సబిహా సుల్తానా, పాఠశాల హెచ్ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకులపై కేసు నమోదు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం పాములాయి సమీపంలోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ పాఠశాల మహిళా ఉద్యోగినిపై అనుచితంగా ప్రవర్తించిన విద్యార్థి నాయకులపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు...శ్రీచైతన్య పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తున్నారంటూ రెండు రోజుల కిందట విద్యార్థి సంఘాల నాయకుల పేరుతో కొందరు వెళ్లి గొడవ చేశారు. ఇదే సమయంలో విధుల్లో ఉన్న హెచ్ఎం రాధిక పట్ల అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించారు. ఈ క్రమంలో బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఓబులేసు, ఆలం, నరసింహతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు

ఆత్మకూరు: మండల కేంద్రంలో శుక్రవారం చిన్న సరిగెత్తు వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలో పలువురు పానకపు కుండలను డప్పులతో పీర్ల చావిడి వద్దకు తీసుకువచ్చి పీర్ల స్వాములకు చదివింపులు చేయించారు. అనంతరం పీర్ల స్వాములను ప్రత్యేక పూల మాలలతో అలంకరించి ఫాతేహాలు చేశారు. సాయంత్రం వన్నూర్ స్వామి పీరుకు గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం విడిదినం, ఆదివారం పెద్ద సరిగెత్తు, సోమవారం జలధి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రాప్తాడు: మండలంలో భోగినేపల్లి, గొందిరెడ్డిపల్లి, గంగలకుంట, అయ్యవారిపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో పీర్ల చావిళ్లలో పీర్లను కొలువుదీర్చారు. ఈనెల 6 పెద్దసరిగెత్తు, 7న జలధి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో పీర్ల పండగ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ శ్రీహర్ష నిర్వాహకులకు సూచించారు.



అలంకరణలో పీర్ల స్వాములు



వన్నూర్‌స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పానకపు కుండలను తీసుకొస్తున్న దృశ్యం



గొందిరెడ్డిపల్లిలో కొలువుదీరిన పీర్లు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం క్రైం: ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టారు. యూనియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.హెచ్.ఆర్ ఖాన్, సోమశేఖరరెడ్డి, కొండయ్య, విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ కాలం చెల్లిన బస్సుల బ్రేక్ డౌన్‌కు గ్యారేజీ సిబ్బందిని బాధ్యులను చేయడం దారుణమన్నారు. ఇన్సెంటివ్ స్కీమ్‌ను అమలు చేయాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు అందుబాటులో ఉన్న సీసీఎస్ ఆఫీసును బస్టాండుకు ఎనిమిది కిలో మీటర్ల దూరం తరలించాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. ప్రభుత్వం ద్వారా ఇవ్వాల్సిన పెండింగ్ డీఏ బకాయిలు 11వ పీఆర్‌సీ అరియర్స్ 24నెలల బకాయిలను వెంటనే ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలన్నారు. రిటైర్డ్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్ క్యాష్‌మెంట్‌ను ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్ నేతలు గోపాల్‌రెడ్డి, డి. ఓబులరత్నం. నాగభూషణం, శివా, శీనా, పీటర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఈయూ నేతలు

కోతుల బెడదతో బెంబేలు



స్కూల్ బిల్డింగ్‌పై కోతులు



కోతుల దాడితో ఉద్యోగులకు గాయాలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక సాయినగర్ మొదటిక్రాస్‌లో ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు కోతుల బెడదతో బెంబేలెత్తుతున్నారు. కొంతకాలంగా స్కూల్ భవనంపై కోతులు ఆవాసం ఏర్పాటు చేసుకుని గుంపులు గుంపులుగా అక్కడే సంచరిస్తున్నాయి. దీంతో తరగతి గదుల్లోకి వెళ్లాలన్నా... బయటకు రావాలన్నా విద్యార్థులు వణికిపోతున్నారు. ఇటీవల ఇద్దరు ఉద్యోగులపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. తరగతి గదుల్లోకి దూరుతున్న కోతులు ఆహారం కోసం విద్యార్థుల బ్యాగులు వెదుకుతున్నాయి. ఈ కారణంగా విద్యార్థులు పాఠశాలకు రావాలంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

‘నవోదయం 2.0’ను పక్కాగా అమలు చేయాలి

అనంతపురం: నవోదయం 2.0 కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధికారి బి. రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని ఎక్సైజ్ సీఐలతో స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 104 నాటు సారా ప్రభావిత గ్రామాల్లో 51 గ్రామాలు ఇప్పటికే నాటు సారా రహిత గ్రామాలుగా ప్రకటించినట్లు వారు తెలిపారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను త్వరగా వేలం వేయాలన్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కర్ణాటక మద్యం రాకుండా సరిహద్దు ప్రాంతాల అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. తరచూ శాంపిల్స్ సేకరించి కల్తీ కల్లును నిరోధించాలని ఆదేశించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) శ్రీరామ్, ఇన్‌స్పెక్టర్లు ఎం. సత్యనారాయణ, కే. జయనాథరెడ్డి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఉన్నతాధికారులు

విజయనగర లా కళాశాలకు న్యాక్ గుర్తింపు



సర్టిఫికెట్ చూపుతున్న ఆలూరి రామిరెడ్డి

అనంతపురం: హౌసింగ్‌బోర్డులోని విజయనగర లా కళాశాలకు న్యాక్ –బి గ్రేడ్ దక్కింది. తెలుగు రాష్ట్రాల్లోని వర్సిటీ అనుబంధ లా కళాశాలకు ఇప్పటి దాకా న్యాక్ గుర్తింపు దక్కలేదు. న్యాక్ గుర్తింపు సాధించిన తొలి కళాశాలగా విజయనగర లా కళాశాలకు ఆ ఘనత దక్కిందని వ్యవస్థాపకులు ఆలూరి రామిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్. రాఘవేంద్ర పేర్కొన్నారు.

పింగళి వెంకయ్య వర్ధంతిని మరచిన అధికారులు

అనంతపురం అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతి నిర్వహణను జిల్లా యంత్రాంగం మరిచింది. పింగళి వెంకయ్య 1963 జూలై 4న మరణించారు. 1916లో భారత దేశానికొక జాతీయ జెండా'' అనే పుస్తకాన్ని ఆంగ్లంలో రాసి ప్రచురించారు. గాంధీజీ సూచన మేరకు ఆకుపచ్చ, కాషాయ, తెలుపు రంగులతో త్రివర్ణ పతాకాన్ని వెంకయ్య రూపొందించారు. మధ్యలో రాట్నం గ్రామ జీవనాన్ని, రైతు కార్మికత్వాన్ని స్ఫురింపజేశారు. 1947 జూలై 22న భారత రాజ్యాంగ సభలో జవహర్‌లాల్ నెహ్రూ ఒక తీర్మానం చేస్తూ... అప్పటి వరకు ఉన్న త్రివర్ణ పతాకంలోని రాట్నాన్ని తీసివేసి దాని స్థానంలో మన పూర్వ సంస్కృతికి సంకేతంగా అశోక ధర్మచక్రాన్ని చిహ్నంగా చేర్చారు. చిహ్నం మార్పు తప్పితే పింగళి వెంకయ్య రూపొందించిన జెండాలో మార్పు లేదు.

అత్యాచారాలు, హత్యల నియంత్రణలో విఫలం

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలను నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మండిపడ్డారు. శుక్రవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఐద్వా నగర మహాసభను నిర్వహించారు. అంతకు ముందు ఐద్వా జెండాను సీనియర్ నేత రామాంజినమ్మ ఆవిష్కరించారు. మానికొండ సూర్యవతి చిత్రపటానికి నేతలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సావిత్రి మాట్లాడుతూ ప్రతి గంటకు ఒక మహిళ హింస, అత్యాచారం, హత్యకు గువుతున్న దుస్థితి నెలకొందన్నారు. సంఘటనలు జరిగినప్పుడు పాలకులు హడావుడి చేయడమే తప్ప దుశ్చర్యలకు అడ్డుకట్ట వేయకపోవడం బాధాకరమన్నారు. అనంతరం ఐద్వా నగర అధ్యక్షురాలిగా శంషాద్, ప్రధాన కార్యదర్శిగా అశ్విని, కోశాధికారిగా గీత, ఆఫీస్ బేరర్లుగా పద్మా, శైలజ, లక్ష్మి, వహిదా, పర్యాబీ, తులసి, మరి కొందరిని ఎన్నుకున్నారు.



నగర మహాసభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి

ఆదర్శప్రాయుడు అల్లూరి సీతారామరాజు

అనంతపురం కార్పొరేషన్: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. శుక్రవారం అల్లూరి జయంతిని పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డితో కలిసి ఆయన అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి వీరోచిత పోరాటం చేశారన్నారు. ఉదయం 10.30 గంటలకు చేయాల్సిన కార్యక్రమాన్ని 12 గంటల వరకు నిర్వహించకపోవడంతో ఇన్‌చార్జ్ ఈఈ నరసింహపై మేయర్ వసీం అసహనం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అబూసలేహా, లాలూ, ఇసాక్, డీఈలు సత్యనారాయణ, దాక్షాయని, సుబ్బయ్య, ఏఈలు సాయినాథ్ బాబు, ఉమామహేశ్వరి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం తదితరులు

బదిలీ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో ఇటీవల రీఅపోర్షన్‌మెంట్ కింద బదిలీ పొందిన వందలాది మంది ఉపాధ్యాయులకు జూన్ నెల జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ ఏడీ శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ విద్యాశక్తి పేరుతో ఉన్నత పాఠశాలల సమయాన్ని జూన్ మాసం నుంచి పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. మొహర్రం సందర్భంగా శనివారం ఉపాధ్యాయులు, పిల్లలు ఆప్షనల్ హాలిడేను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, నాయకులు పుల్లయ్య, చిదంబరయ్య, తిప్పేస్వామి, రామ్మూర్తి, మన్సూర్ పాల్గొన్నారు.



విద్యాశాఖ ఏడీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఘనంగా ‘గంగాగౌరీ’ స్వర్ణోత్సవం



కేక్ కట్ చేస్తున్న గౌరీ సినీకాంప్లెక్స్ యజమానులు

అనంతపురం కల్చరల్: నగరంలోని గంగాగౌరీ సినీ కాంప్లెక్స్‌లో థియేటర్లు నిర్మించిన 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం స్వర్ణోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. థియేటర్ వ్యవస్థాపకులైన ఎస్. వెంకటనారాయణరెడ్డి, వన్నూర్‌రెడ్డి, చిన్న వెంకటరెడ్డి, సీతారామిరెడ్డి, రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. 1971లో సానె పెద్దవీరారెడ్డి గౌరీ సినీ కాంప్లెక్స్ నిర్మాణం ప్రారంభించినట్లు వారు తెలిపారు. 1975 జూలై 4న 980 సీట్ల సామర్థ్యంతో గౌరీ థియేటర్ 70 ఎం.ఎం. స్క్రీన్‌తో ప్రారంభమైందని తెలిపారు. అత్యాధునిక డిజిటల్ సౌండ్ సిస్టమ్‌తో వినోదాన్ని పంచుతున్న థియేటర్లను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు తొలి ఏకాదశి వేడుకలు

అనంతపురం కల్చరల్: రామ్‌నగర్‌లోని రుక్మిణీ పాండురంగ విఠల స్వామి వారి ఆలయంలో ఆదివారం జిల్లా భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో తొలి ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఆనంద్ శుక్రవారం తెలిపారు. ఉదయం ఐదు గంటల నుంచే రుక్మిణీ పాండురంగ స్వామికి భక్తులతో అభిషేకం నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నల్లాని రాజేశ్వరికి దక్షిణ భారత మహిళా విజేత అవార్డు

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సామాజిక కార్యకర్త, కవయిత్రి నల్లాని రాజేశ్వరి అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ తమిళనాడు శాఖ, గ్లోబల్ పింక్ ఆర్మీ సంయుక్త ఆధ్వర్యంలో అందించే దక్షిణభారత మహిళా విజేత–25 అవార్డుకు ఎంపికైంది. ఈనెల 6న చెన్నైలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నారు. ఇన్స్పియేటివ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా పలుసాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించిన నల్లాని రాజేశ్వరి పలు అవార్డులు, రివార్డులనందుకున్నారు. ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికైన ఆమెకు పలువురు సాహితీవేత్తలు, సామాజిక సేవాకార్యకర్తలు అభినందనలు తెలిపారు.

ఆకలి తీర్చలేని ‘యోగా’కు రూ. 300 కోట్లు అవసరమా?

రాప్తాడురూరల్: ఆకలి తీర్చలేని ‘యోగా’కు రూ. 300 కోట్లు ప్రజాధనం ఖర్చు చేయడం అవసరమా? అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యవర్గ సమావేశం అనంతపురం సీపీఐ కార్యాలయంలో ఆత్మకూరు మండల సహాయ కార్యదర్శి శివ అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నా ప్రధాని నరేంద్రమోదీని ఆనందపరచడానికి ప్రభుత్వం యోగా పేరుతో రూ.కోట్లు ఖర్చు చేసిందన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, రూరల్ మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి నరేష్, ఆత్మకూరు, రాప్తాడు మండల కార్యదర్శులు రామకృష్ణ, రవీంద్ర, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ కార్మికులకు అండగా ఉంటుందని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. నగర పాలక సంస్థ ముందు రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులకు ఆయన సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. డిప్యూటీ మేయర్ వెంట కార్పొరేటర్లు లాలూ, అబూసలేహా, తదితరులున్నారు. ఇదిలా ఉండగా కమిషనర్ బాలస్వామి వేదిక వద్దకు వచ్చి కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

కృత్రిమ కాళ్ల పంపిణీ అభినందనీయం



దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లను ఫ్రీడమ్ ట్రస్ట్ అందించడం అభినందనీయమని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. చెన్నైకు చెందిన ఫ్రీడమ్ ట్రస్ట్ సంస్థ అధినేత డాక్టర్ సుందర్, ట్రస్ట్ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, ముంబయికి చెందిన సేవెక్స్ టెక్నాలజీస్ సంస్థ అధినేత లతాజోషి సౌజన్యంతో 195 మందికి రూ.25 లక్షల విలువచేసే కృత్రిమ కాళ్లు, చేతికర్రలు అందించే కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పేదలైన విభిన్న ప్రతిభావంతులు ఒక్కొక్కరికి రూ.12 వేలు విలువ చేసే కృత్రిమ కాలు ఉచితంగా అందించడం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రాప్తాడురూరల్: సహకార వారోత్సవాల్లో భాగంగా అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సిండికేట్‌నగర్ జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులకు ‘సహకార సంఘం అభివృద్ధి’ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ రోషన్ జమీర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ ఆర్.శ్రీనివాసులు, స్కూల్ హెచ్ఎం దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.

డిపోలపై పర్యవేక్షణ పెంచండి

అనంతపురం క్రైం: ఆర్టీసీ డిపోల్లో సిబ్బంది పనితీరు, బస్సుల కండీషన్‌పై పర్యవేక్షణను పెంచాలని ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని డీఎంలకు సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్ఎం కార్యాలయంలో జిల్లాలోని డిపో మేనేజర్లతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మేనేజర్లకు పలు సూచనలు చేశారు. డీఎంలతో పాటు డిప్యూటీ సీటీఎం కే. శ్రీలక్ష్మి, పీఓ చంద్రాయుడు, ఏఓ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

రోశయ్య గొప్ప రాజనీతిజ్ఞుడు

అనంతపురం టవర్‌క్లాక్: కొణిజేటి రోశయ్య గొప్ప రాజనీతిజ్ఞుడు అని ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి ముడియం రమణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 92వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముడియం రమణ మాట్లాడుతూ రోశయ్య ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వర్తించారన్నారు. నీతిని జాయితీతో సేవలందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమహేష్, నాగరాజు, ప్రభాకర్, సురేష్, మాకం సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని డీ–5 సెక్షన్ పరిధిలోని తపోవనం, సోమనాథ్‌నగర్, ప్రశాంతినగర్, జనశక్తినగర్, యువజనకాలనీ, రజకనగర్, శాంతినగర్ తదితర కాలనీల్లో 33 కేవీలైన్ మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ మునిరాజు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు ‘చెట్టు’ పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన ద్విభాషా కవి జూటూరు షరీఫ్ రచించిన చెట్టు పుస్తకావిష్కరణ ఆదివారం ఉదయం 10 గంటలకు ఉపాధ్యాయభవన్‌లో జరగనుంది. ఏపీ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగే సాహిత్య కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ హాజరవుతున్నట్లు నిర్వాహకుడు తన్నీరు నాగేంద్ర తెలిపారు.

యువతి అదృశ్యం కేసు ఛేదింపు

అనంతపురం: యువతి అదృశ్యం కేసును పోలీసులు ఛేదించారు. వివరాలు..శ్రీనివాస్ నగర్‌లో నివాసం ఉంటున్న కొండయ్య కూతురు లక్ష్మి (22) గత నెల 20న స్పెషల్ కోర్సు నేర్చుకోవడానికి బెంగళూరుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. తండ్రి విచారించగా ఆమె బెంగళూరు వెళ్లలేదని తెలిసింది. దీంతో అనంతపురం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. తమిళనాడుకు వెళ్లిన లక్ష్మి ఆచూకీ కనుక్కొని పోలీసులు శుక్రవారం అనంతపురం తహశీల్దార్ హరికుమార్ వద్ద హాజరుపరిచారు. లక్ష్మి శివప్రసాద్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్నారు. ఆమె మేజర్ కావడంతో తన ఇష్టపూర్వకంగా భర్త శివప్రసాద్‌తో ఉంటానని పేర్కొనడంతో ఆయనకు అప్పగించారు.